సాక్షి రంగారెడ్డి

శనివారం । 30 । డిసెంబర్ । 2023



ఖాకీలమంటారు..

లారీలను లక్ష్యంగా చేసుకుంటారు.. పోలీసులమంటూ తనిఖీల పేరుతో అందిన కాడికి దోచుకుంటారు..

10లో ▸



డ్రగ్స్ దందా

జల్సాలకు అలవాటు పడ్డారు.. సునాయాసంగా సంపాదించాలనుకున్నారు. డ్రగ్స్ దందా ఎంచుకున్నారు.

10లో ▸



రైతులకు మరింత మేలు

కూరగాయలను అమ్ముకునేందుకు సాయంకాలం మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

10లో ▸

న్యూస్‌రీల్

'అభయహస్తం' దరఖాస్తులు విక్రయిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: అభయహస్తం పథకం అమలు కోసం ప్రభుత్వం అందజేస్తున్న దరఖాస్తు ఫారంలను విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి కార్యక్రమం కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిరాక్స్ సెంటర్స్, మీ సేవా కేంద్రాల్లో, ఇతర దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వం

జెడ్పీసీఈఓ దిలీప్‌కుమార్



మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ దిలీప్‌కుమార్

షాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వమే ప్రజల వద్దకు వస్తుందని జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, పీడీ డీఆర్‌డీఓ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐదు గ్యారంటీలకు ఒకే దరఖాస్తు చేసుకోవాలని, ప్రజాపాలన కార్యక్రమంలో అర్జీలు పెట్టుకోని వారు జనవరి 6వరకు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ హన్మంత్ రెడ్డి, షాబాద్ సర్పంచ్ సుబ్రమణ్వేశ్వరి రవీందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈర్లపల్లిలో పర్యటించిన అధికారులు

చేవెళ్ల: గ్రామాల్లో చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీసీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఏ పడీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని ఈర్లపల్లిలో దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటర్ల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, మండల వ్యవసాధికారి తులసి, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, రాజశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, విద్యుత్ ఏడీ స్వామి, ఏఈ ఖాజామొయినుద్దీన్ పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌లో 'సెవెన్ కలర్స్'

స్టూడియోను ప్రారంభించిన గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్



మాట్లాడుతున్న అల్లు అరవింద్

మొయినాబాద్ రూరల్: జీవితంలోని మధుర క్షణాలు, ప్రత్యేక వేడుకలను పదిలపర్చుకోవడానికి స్టూడియోలు ఎంతగానో దోహదం చేస్తాయని గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ అన్నారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలో ఏర్పాటు చేసిన 'సెవెన్ కలర్స్' కన్వెన్షన్, స్టూడియోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అరవింద్.. ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను, సినీ హీరో కార్తికేయ, ఆలీతో కలిసి స్టూడియోను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీలో పనిచేస్తున్న ఏడుగురు మిత్రులు కలిసి నగరానికి సమీపంలో స్టూడియో నెలకొల్పడం అభినందనీయమన్నారు. కౌబాయ్, మేఘాలై, వైట్ ప్యాలెస్, రాజస్థాని బేబీ షూట్, విలేజ్ సెటప్ లతో సహా 75కు పైగా ఎలక్ట్రిఫయింగ్ టీమ్‌లు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని కితాబిచ్చారు. రానున్న రోజుల్లో వీటిని 90కి విస్తరించాలని సూచించారు. స్టూడియోలో ఏర్పాటు చేసిన అతిపెద్ద స్టేజ్ ఆఫ్ ఆర్ట్ ప్రీ వెడ్డింగ్, బేబీ అండ్ కిడ్స్ ఫోటో స్టూడియో బాగున్నాయన్నారు. యాంకర్లు సుమకనకాల, అనసూయ, రవి, నటులు రాజారవీందర్, స్టూడియో మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కాడియాలా, వజ్రా గ్రూప్ లిమిటెడ్ సీఈఓ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్షణంతో మోదం ఖేదం

రైతులకు కలిసిరాని కాలం

- ఫార్మాసిటీ రద్దు ప్రకటనతో అన్నదాతల్లో ఆనందం
- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం.. చెరువులు కుంటలు మాయం
- ఫాక్స్‌కాన్ సహా పలు కంపెనీల రాకతో పెరిగిన ఉపాధి
- తలసరి ఆదాయం.. విద్యుత్ వినియోగంలో జిల్లానే టాప్
- కలెక్టర్లపై ఆరోపణలు.. బదిలీలు
- జాతీయ స్థాయి నేతల పర్యటనలతో హీటెక్కిన రాజకీయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నో సంచలనాలకు జిల్లా కేంద్ర బిందువుగా నిలిచింది. రాష్ట్ర రాజకీయాలతో పాటుగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లోనూ కీలకంగా మారింది. కోవిడ్ తర్వాత అభివృద్ధిలో పరుగులు పెట్టింది. 50 నుంచి 59 అంతస్తుల టాప్‌టెన్ హైరేంజ్ బిల్డింగ్‌లు జిల్లాలోనే ఉన్నట్లు హెచ్ఎండీఏ ప్రకటించింది. జాతీయ సగటు ఆదాయంతో పాటుగా జాతీయ సగటు విద్యుత్ వినియోగంలోనూ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. విద్య, ఉపాధి, పారిశ్రామిక, రియాలిటీ రంగాల్లోనూ దూకుడు ప్రదర్శించింది. దీంతో పాటుగా కొన్ని అపవాదులను మూటకట్టుకుంది. వర్షాభావం రైతులకు నష్టాలను మిగల్చగా.. సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. గతంతో పోలిస్తే పది, ఇంటర్ ఫలితాలు ఈ ఏడాది కొంత నిరాశకు గురిచేశాయి. ఫాక్స్‌కాన్ కంపెనీ పెట్టుబడులు సహా రైల్వేకోచ్ ప్రారంభోత్సవాలు జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిపెట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఫార్మాసిటీ రద్దు ప్రకటన ఆ ప్రాంత రైతులకు పెద్ద ఊరటను ఇచ్చింది. మొత్తంగా 2023 సంవత్సరం జిల్లాలో కొంత మంది జీవితాల్లో విషాదాన్ని మిగల్చగా.. మరికొంత మంది జీవితాల్లో ఆనందాన్ని నింపింది.

రాజకీయాలకు కేంద్ర బిందువు

ఏడాది ప్రారంభంలో హెచ్ఐసీసీ వేదికగా బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు జిల్లా వేదికైంది. సెప్టెంబర్ 17న తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ విజయ భేరీ మోగించింది. సోనియా, రాహుల్, ఖర్గే సహా దేశవ్యాప్తంగా ఉన్న 320 మంది ముఖ్య నేతలు ఈ సభకు హాజరయ్యారు. అంతకు ముందు షాద్‌నగర్, రాజేంద్రనగర్ మీదుగా రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర నిర్వహించారు. బీజేపీ ముఖ్య నేతలు నరేంద్రమోదీ, అమిత్‌షా, నడ్డా, ఇతర కేంద్ర మంత్రులు జిల్లాలో పలుమార్లు పర్యటించారు. మాజీ సీఎం కేసీఆర్ సైతం హరితహారం కార్యక్రమాన్ని తుమ్మలూరు నుంచే ప్రారంభించారు. 29 పార్టీల నుంచి మొత్తం 209 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఎన్నికల వేళ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్ సహా మరికొంత మంది నేతల ఇళ్లపై ఐటీరైడ్స్ సంచలనం సృష్టించాయి. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీటిలో మూడు చోట్ల బీఆర్ఎస్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మహేశ్వరం, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్లలో మళ్లీ విజయం



సాధించింది. కల్వకుర్తి, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ గతంతో పోలిస్తే భారీగా పుంజుకుంది. కొత్తగా ఏర్పడిన మంత్రివర్గంలో జిల్లా నేతలకు ప్రాతినిధ్యం లభించక పోవడం జిల్లాకు నిరాశను మిగిల్చింది.

రెవెన్యూకు అవినీతి మరక

రెవెన్యూ అధికారులు.. ప్రజా ప్రతినిధులు.. రియల్టర్లతో చేతులు కలిపి జిల్లాలోని వందలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్ భూములను కొల్లగొట్టారు. ధరణి సాంకేతిక పరిజ్ఞానం పలు వివాదాలకు, అధికారుల్లో అవినీతికి కారణమైంది. జిల్లా కలెక్టర్లుగా వ్యవహరించిన అమయ్‌కుమార్, హరీశ్ ఆరోపణలు ఎదుర్కొనక తప్పలేదు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్‌గా వచ్చిన భారతి హోళికేరి సైతం 98 వివాదాస్పద ఫైళ్లు క్లియర్ చేయడంతో ప్రభుత్వం ఆమెను బదిలీ చేసిన విషయం విదితమే. మాడ్గుల, శేరిలింగంపల్లి సహా పలువురు తహసీల్దార్లపై ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో కందుకూరు తహసీల్దార్‌గా పని చేసిన ఓ తహసీల్దార్ ఇంటిపై అవినీతి నిరోధకశాఖ దాడులు చేసి, భారీగా నగదును గుర్తించడం సంచలనం సృష్టించింది.

'సాక్షి' వెలుగులోకి తెచ్చిన అంశాలు

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం సాక్షి బృందం అహర్నిశలు శ్రమించింది.

- కొత్తూరు మండలం పెంజర్లలోని సర్వే నంబర్ 255లో 52 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమికి జులై 25న రాత్రి తొమ్మిది గంటలకు రిజిస్ట్రేషన్, శంకర్‌పల్లి మండలం కొండకల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 555లో 117.16 ఎకరాల బీలా దాఖలా భూములు అక్రమ రిజిస్ట్రేషన్ల అంశాన్ని వెలుగులోకి తెచ్చింది.
- గుండేరావు పాంపాడ్ తన కుమారుడి స్మారకార్థం నందిగామ మండల పరిధిలో 102 ఎకరాలను 1940 లోనే ట్రస్ట్‌కు రాసిచ్చారు. జూలై 12న రాత్రికి రాత్రే ఈ భూముల్లో 35.01ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన వైనాన్ని వెలుగులోకి తెచ్చింది.
- శంషాబాద్ మండలం మదనపల్లి రెవెన్యూ కొత్తతండాలో 559 ఎకరాల, అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చేసిన వైనం, మహేశ్వరం మండలం మంకాల్ గ్రామం విమానాశ్రయానికి సమీపంలోని రూ.325 కోట్ల విలు వ చేసే 25.32 ఎకరాల ప్రభుత్వ భూమి ఓ వెంచర్‌లో కలిపేసుకున్న వైనాన్ని, ఇదే మున్సిపాలిటీ పరిధిలోని 360.11 ఎ కరాల హెచ్ఎండీఏ భూమిలో 28 ఎకరాలను రి యల్టర్లు కొల్లగొట్టిన వైనాన్ని కళ్ల ముందుంచింది.
- మొయినాబాద్ మండలం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని 367 ఎకరాల ప్రభుత్వ భూమి, అజీజ్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై వరుస కథనాలు ప్రచురించింది.
- ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూదాన్ భూములకు నష్టపరిహారం చెల్లింపు వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చింది. గోపన్‌పల్లి 5.30 ఎకరాల్లోని ఈద్గవాని కుంట సహా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, హయత్‌నగర్ మండల సరిహద్దులోని హత్తిగూడ 19 సర్వే నంబర్‌లోని 6.23 ఎకరాల విస్తీర్ణంలోని కుంట కాలగర్భంలో కలిసిపోయింది.
- తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 776లోని కొత్తకుంట సైతం ఆక్రమణకు గురైన అంశాలను సాక్షి వెలుగులోకి తెచ్చింది.



పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లతో సమావేశమైన వ్యయ పరిశీలకులు

వ్యయ వివరాలు సమర్పించాలి

- ఎనిమిది సెగ్మెంట్‌లలో పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల ఖర్చులు చూపాలి
- లేదంటే మూడేళ్ల వరకు పోటీకి అనర్హులు
- జిల్లా వ్యయ పరిశీలకులు వినోద్ కుమార్ అహిర్వార్, ప్రియారంజ్ శ్రీవాస్తవ, శంకర్‌గుప్తా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ఖర్చు వివరాలను గడువులోగా సమర్పించాలని జిల్లా వ్యయ పరిశీలకులు వినోద్ కుమార్ అహిర్వార్, ప్రియారంజాన్ శ్రీవాస్తవ, శంకర్ గుప్తా అన్నారు. 2023 శాసన సభ ఎన్నికల్లో జిల్లాలోని ఎనిమిది సెగ్మెంట్ల నుంచి పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో చేసిన ఖర్చు మొత్తాలను సరిచూసుకుని అవసరమైన వివరాలను సమర్పించాలని సూచించారు. పోటీ చేసిన అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలు సరిపోల్చుకునేందుకు వీలుగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రీకన్సిలేషన్ నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు వినోద్ కుమార్ అహిర్వార్, ప్రియారంజాన్ శ్రీవాస్తవ, శంకర్ గుప్తా అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను, వ్యత్యాసాలను పరిశీలించారు.

సమీపిస్తున్న గడువు

ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజువారీ ఖాతా రిజిస్టర్, నగదు లావాదేవీల రిజిస్టర్, బ్యాంక్ రిజిస్టర్, స్టేట్‌మెంట్ (పార్ట్-1 నుంచి 4 వరకు), షెడ్యూల్‌లో 1 నుంచి 11 వరకు గల ఎన్నికల ఖర్చుల వివరాలను సరి చూసుకుని సరైన క్రమ సంఖ్యతో కూడిన అన్ని బిల్లులు, వోచర్లు, ఒరిజినల్ అఫిడవిట్, స్వీయ ధృవీకరణతో కూడిన బ్యాంకు స్టేట్‌మెంట్ తదితర వాటిని ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన 30 రోజుల లోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బ్యానర్స్, పోస్టర్స్, దినపత్రికలు, టీవీ ఛానల్స్‌లో ఇచ్చిన ప్రకటనల వివరాలు, వాటికైనా ఖర్చుల వివరాలు తెలియజేయాలని సూచించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సరైన రీతిలో ఖర్చుల వివరాలను సమర్పించేలా ఏఈఓలు మార్గనిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను సకాలంలో, నిర్ణీత పద్ధతిలో సమర్పించని పక్షంలో అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నిర్ణీత కాల వ్యవధిలోపు స్పందించని వారిపై ఆర్పీచట్టం, 1951లోని సెక్షన్ 10ఎ ప్రకారం అనర్హత విధించాలని కోరుతూ.. ఎలక్షన్ కమిషన్‌కు లేఖ అందజేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ద్వారా అనర్హులుగా ప్రకటించబడిన వారు మూడేళ్ల వరకు ఎటువంటి ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఉండదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి వెంకటరెడ్డి, ధాత్రిదేవి, ఆయా నియోజకవర్గాల నుండి పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, ఏఈఓలు పాల్గొన్నారు.

'ఫీవర్'లో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శుక్రవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మొత్తం 31 మంది అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించి ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా వారిలో ముగ్గురికి పాజిటివ్‌గా తేలిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో ఒకరు అనారోగ్యంతో ఫీవర్ ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి కాగా మిగిలిన ఇద్దరు నగరంలోని ఓ యూపీహెచ్‌సీ నుంచి వచ్చిన వారి శాంపిల్స్ అని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు కూడా హోం ఐసోలేషన్‌లో ఉన్నారని చెప్పారు. రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్న కారణంగా వైరస్ మరింతగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఆత్మజ్ఞానుల కోసమే 'పీఎస్ఎస్ఎం'

కడ్తాల్: ఆత్మజ్ఞానుల కోసం పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్(పీఎస్ఎస్ఎం) వేదిక సిద్ధంగా ఉంటుందని ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రిజీ సతిమణి, గురుమాత స్వర్ణమాల పత్రి అన్నారు మహేశ్వర మహాపిరమిడ్‌లో కొనసాగుతున్న పత్రిజీ ధ్యాన మహాయాగాలు శుక్రవారంతో తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్వర్ణమాల పత్రి ప్రసంగిస్తూ పత్రిజీ ధ్యానులను తండ్రిలా అక్కున చేర్చుకున్నారని గుర్తుచేసుకున్నారు. ప్రపంచాన్ని శాఖాహార జగత్తు చేయాలన్నారు.

మహిళలకు ఉన్నత స్థానం

పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళపత్రి, పరిణిత పత్రి ప్రసంగిస్తూ.. పీఎస్ఎస్ఎంలో మహిళలకు ఉన్నత స్థానం కల్పించిందన్నారు. సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న గురుమాత స్వర్ణమాల పత్రి

'ఆటా' సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- పీఎస్‌కు బారికేడ్లు, స్కూళ్లకు మైకు సెట్లు అందజేత

కడ్తాల్: తెలుగు రాష్ట్రాల్లో అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) అందిస్తున్న సేవలు అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆటా-2023 వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ సౌజన్యంతో సమకూర్చిన రూ.లక్ష విలువచేసే బారికేడ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఐ శివప్రసాద్‌కు అందజేశారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాల, బాలుర, బాలికల హైస్కూళ్లతో పాటు యూపీఎస్, జీయూపీఎస్, కేజీబీవీకి రూ.లక్ష విలువ చేసే స్కూల్ బ్యాగులు, మైక్ సెట్లు, డ్రమ్స్, బ్యాండ్ సెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో ప్రవాస భారతీయులు చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని కొనియాడారు. ఆటా ఆధ్వర్యంలో గతంలోనూ అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం ప్రవాస భారతీయుడు, మండల కేంద్రానికి కిశోర్‌గూడూరుతో పాటు, ఆటా ప్రతినిధులు రామకృష్ణ ఆలే, నర్సింహారెడ్డి, సతీశ్, సాయిసూదిని, పరమేశ్వర్, మిమిక్రి రమేశ్‌ను స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులకు డ్రమ్స్, మైక్ సెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆటా ప్రతినిధులు

ప్రజల గొంతుకగా ప్రశ్నిద్దాం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న సబితారెడ్డి

- సంక్షేమ పథకాలు అందించకపోతే ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- మాజీ మంత్రి సబితారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజల గొంతుకగా మారి ప్రశ్నించాలని.. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో పార్టీలకతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం చేయకపోతే ఉపేక్షించమన్నారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికమని ప్రకటించినప్పుడు ముందుగా రేషన్ కార్డులు ఇచ్చిన తర్వాతే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి సమీక్షలు నిర్వహించకుండా ఫార్మాసిటీ రద్దు ప్రకటన చేయడం బాధాకరమన్నారు. మెగా టౌన్‌షిప్‌తో యువతకు, ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని గొప్పగా తీర్చిదిద్దారని, అబద్ధాలు, అసత్యాల ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిచారని వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

మహనీయుడి మార్గంలో నడవాలి

ఇంద్రారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తూరు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే డిక్కి చైర్మన్ నర్రా రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మహనీయుడు అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ నియోజకవర్గం ప్రధానకార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, గణేష్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర, జయమ్మ, కాకి ఇందిర, ఎస్సీ, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు చిర్ర సాయిలు, లచ్చానాయక్, మంద సాయిలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఖాకీలమంటారు.. కాసులు దండుకుంటారు

నకిలీ పోలీసు ముఠా గుట్టురట్టు

- పోలీసుల పేరుతో దారి దోపిడీ
- ఇద్దరు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి



సమావేశంలో నిందితులను చూపుతున్న ఏసీపీ రంగస్వామి తదితరులు

షాద్‌నగర్‌రూరల్: జాతీయ రహదారిపై వెళ్లే లారీలను లక్ష్యంగా చేసుకుంటారు.. పోలీసుల మంటూ తనిఖీల పేరుతో అందిన కాడికి దోచుకుంటారు.. ఖాకీల పేరుతో దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు చేశారు.. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం పట్టణ సీఐ ప్రతాప్ లింగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్ చింతల్‌మెట్‌కు చెందిన షాబాజ్ అలియాస్ హైదర్, సయ్యద్‌అన్వర్ అలియాస్ లాల, షాబాజ్, మహ్మద్ సోహైల్‌లు ముఠాగా ఏర్పడి నకిలీ పోలీసుల అవతారం ఎత్తారు. ఈ నెల 5న నారాయణపేట జిల్లా జానంపేటకు చెందిన డ్రైవర్ మహ్మద్ అల్తాఫ్ హుస్సేన్ డీసీఎంలో వడ్ల లోడుతో జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నాడు. అర్ధరాత్రి పట్టణ శివారులోని అనూస్ పరిశ్రమ వద్ద జాతీయ రహదారి వెళుతుండగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు డీసీఎంను ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయాలని డీసీఎం క్యాబిన్‌లోకి ప్రవేశించి డ్రైవర్ మహ్మద్ అల్తాఫ్ హుస్సేన్‌ను బెదిరించి రూ.50 వేలు దోచుకొని పారిపోయారు. ఈ విషయమై డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, క్రైం అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రాంరెడ్డి ఆధ్వర్యంలో కేసును ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆధారాలను సేకరించిన పోలీసులు సయ్యద్‌అన్వర్, మహ్మద్‌సోహైల్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని ఒక ద్విచక్ర వాహనం, రూ.1100 నగదు స్వాధీన పర్చుకొని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ ముఠాపై శంషాబాద్, శామీర్‌పేట్, మేడ్చల్, చేవెళ్ల, చౌటుప్పల్, ములుగు, పటాన్‌చెరువు, సిద్దిపేట్ పోలీస్‌స్టేషన్‌లో 10 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, డీఐ రాంరెడ్డి, ఎస్ఐ అలంక్రిత్‌గౌడ్, సీసీఎస్ ఎస్ఐ వీరబాబు, సిబ్బంది మోహన్, జాకీర్, కరుణాకర్, రాజు, యాదగిరి, రఫీని ఏసీపీ రంగస్వామి అభినందించారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రతాప్ లింగం, డీఐ రాంరెడ్డి, ఎస్ఐ దేవకి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుకు వెళ్లి అనంత లోకాలకు

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- టైర్ల కింద నలిగి మహిళ మృతి
- ఇబ్రహీంపట్నంలో ఘటన



ఎల్లమ్మ(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకునేందుకు జిరాక్స్ కాపీల కోసం వెళ్తున్న దంపతుల బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ గోవింద్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని వడ్డెర బస్తీకి చెందిన వరికుప్పల ఎల్లమ్మ తన భర్త కిష్టయ్యతో కలిసి బైక్‌పై వెళ్తుండగా.. బస్టాండ్ సమీపంలో హైదరాబాద్ నుంచి ఆగాపల్లి వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్లమ్మ (55) లారీ చక్రాల కింద పడి నలిగిపోయింది. కిష్టయ్యకు గాయాలు కావడంతో సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఎల్లమ్మ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసేందుకు జిరాక్స్ కాపీలు తీసుకువస్తామని బాధితులు ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు బాధితుల బంధువులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫారాల కవర్ ఎల్లమ్మ చేతిలోనే ఉండటం చూపరులను కంటతడి పెట్టించింది.

ఈజీ మనీ కోసం డ్రగ్స్ దందా



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

- జల్సాలకు అలవాటు పడి మత్తు పదార్థాల రవాణా
- గోవా నుంచి హైదరాబాద్‌కు సరఫరా
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, సెల్‌ఫోన్‌లు

షాద్‌నగర్ రూరల్: జల్సాలకు అలవాటు పడ్డారు.. సునాయాసంగా సంపాదించాలనుకున్నారు.. ఇందుకోసం డ్రగ్స్ దందాను ఎంచుకున్నారు... గోవా నుంచి హైదరాబాద్‌కు మత్తు పదార్థాలు సరఫరా చేస్తూ గురువారం రాత్రి పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం టౌన్ సీఐ ప్రతాప్‌లింగంతో కలిసి ఏసీపీ రంగస్వామి వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ప్రియాంకరెడ్డి అలియాస్ ప్రియ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉంటూ ఆర్కిటెక్చర్‌గా పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన శ్రీతేజ మాదాపూర్‌లో ఉంటూ టెక్‌మహీంద్రా కంపెనీలో పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ప్రియాంకరెడ్డి, శ్రీతేజ సునాయసంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకు డ్రగ్స్ దందాను ఎంచుకుని, తెలిసిన వారికి సరఫరా చేస్తున్నారు. గోవాలో ఉంటున్న శివ, భరత్‌కుమార్ సాయంతో గోవాలోని అరంబోల్‌లో ఉంటున్న రష్యాకు చెందిన అణ అనే మహిళ వద్ద డ్రగ్స్(ఎండీఎంఏ)ను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. ఇందుకు హైదరాబాద్‌కు చెందిన దినేశ్, గిరీష్, అఖిల్‌ను ఏజెంట్లుగా పెట్టుకున్నారు. నూతన సంవత్సర వేడుకల కోసం ఈ నెల 28న గోవా నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో శంషాబాద్ డీసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ దేవకి ఆధ్వర్యంలో ఎస్ఓటీ పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రియాంక, శ్రీతేజ నుంచి రూ.1లక్ష విలువచేసే 11గ్రాముల డ్రగ్స్‌ను పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని డ్రగ్స్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారణ చేయగా డ్రగ్స్ ఎక్కడ తీసుకున్నారు, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారనే వివరాలను రాబట్టారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి రష్యా మహిళ అణతో పాటుగా వీరికి సహకరించిన శివ, భరత్‌కుమార్ డ్రగ్స్ తీసుకున్న దినేష్, గిరీష్, అఖిల్, దినేష్ పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కేసు విచారణ అనంతరం నిందితులు ప్రియాంక, శ్రీతేజను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. డ్రగ్స్‌ను తరలించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌ను ముఠాను పట్టుకున్న సీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఐ దేవకి, ఎస్ఓటీ ఎస్ఐలు రమణారెడ్డి, రాజశేఖర్, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో డీఐ రాంరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ ఆత్మహత్య

షాపులోనే ఉరేసుకున్న వైనం



సమీర్ (ఫైల్)

మీర్‌పేట: పనిచేసే షాపులోనే బైక్ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బద్యానాయక్ వివరాల ప్రకారం.. కందుకూరు మండలం ఆకులమైలారానికి చెందిన ప్రవీణ్‌కుమార్ అల్మాస్‌గూడ విశాఖనగర్‌లో రాఘవేంద్ర బైక్ పాయింట్ నడిపిస్తున్నాడు. దానిలో అదే గ్రామానికి చెందిన మొహమ్మద్ సమీర్(19) కొంత కాలంగా మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సమీర్ షాపులో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యజమాని ప్రవీణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కిరాణాషాపులో చోరీ



హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లిన దుండగులు

కందుకూరు: కిరాణా షాపులోకి చొరబడ్డ దొంగలు నగదు, విలువైన వస్తువులు అపహరించుకుపోయారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో శ్రీశైలం రహదారిపై బోలారం చౌదరి 15 ఏళ్లుగా కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి షాపు మూసి వేసి పనిచేస్తున్న ఇద్దరితో పాటు వెళ్లిపోయాడు. అదే రోజు అర్ధరాత్రి దుండగులు షాపు తాళాలు విరగగొట్టి చొరబడ్డారు. షాపులో ఉన్న రూ.25 వేల నగదుతో పాటు దీపావళి పండగకు పూజ చేసి గల్లా పెట్టెలో ఉంచిన 35 వెండి నాణేలు, రూ.60 వేల విలువ గల సిగిరెట్ బాక్సులు, గోశాల కోసం ఏర్పాటు చేసిన రూ.9 వేల నగదుతో పాటు సీసీ టీవీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను తస్కరించుకుపోయారు. ఉదయం దొంగతనం జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. మొత్తం విలువ రూ.1.30 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వివరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యాచారం: ఆర్థిక ఇబ్బందులతో విషం తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకులమైలారం గ్రామానికి చెందిన లాడె కుమార్(25) ఆర్థిక ఇబ్బందులతో మూడు రోజుల కిందట తన వ్యవసాయ పొలం వద్ద విషం తాగాడు. పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కుమార్ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య అలివేలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నియామకం



మారుతికిరణ్

పరిగి: పీఎం విశ్వకర్మ యోజన చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్ భూనేటిని నియమిస్తూ బీజేపీ జాతీయ నాయకత్వం ఉత్తర్వులు జారిచేసింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో ఈ పథకం ద్వారా అర్హులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని అధిష్టానం ఆదేశించినట్లు పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం తనపై నమ్మకంతో అప్పగించిన పనిని తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.

ప్రజాపాలనతో సంక్షేమం

- ప్రజలు సద్వినియోగించుకోవాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో సర్పంచ్ సంతోష అధ్యక్షతన శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో పథకాలను అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలిందని, అధికారుల చుట్టూ ఎన్నో ప్రదక్షిణలు చేసినా పనులు కాలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే అధికారులు వచ్చే విధంగా కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగానే ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, నాయకులు శ్రీశైలం, గురు రాజారావు, శివ, రాజశేఖర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరింత మేలు



సాయంకాలం మార్కెట్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

- అందుబాటులోకి 'సాయంకాలం మార్కెట్'
- చేవెళ్ల యార్డులో ప్రారంభం
- మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారిణి ఛాయాదేవి

చేవెళ్ల: రైతులు పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు మార్కెట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చామని మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారిణి ఛాయాదేవి పేర్కొన్నారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి ఆధ్వర్యంలో సాయంకాలం మార్కెట్‌ను గుడిమల్కాపూర్ స్పెషల్‌గ్రేడ్ కార్యదర్శి అపర్ణ, స్థానిక రైతులు, వ్యాపారులతో కలిసి ఆమె ప్రారంభించారు. మొదట క్యారెట్, బిట్‌రూట్, ఆనంకాయలను వేలం బీట్‌లు పెట్టి మార్కెట్ ఆరంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల కూరగాయల హబ్‌గా ఉందని, ఈ ప్రాంతంలో మార్కెట్ సౌకర్యం మరింత చేరువ చేసేందుకే సాయంకాలం మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇక్కడి రైతులు ఎక్కువగా కూరగాయలను హైదరాబాద్‌లోని గుడిమాల్కాపూర్, బోయిన్‌పల్లి మార్కెట్‌కు తరలిస్తుంటారని దీని వల్ల రైతులకు రవాణాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మారేకెట్ సభ్యుల సూచన మేరకు సాయంకాలం మార్కెట్ ప్రారంభించామన్నారు. దీన్ని రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటల చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు జరుగుతాయన్నారు. మార్కెట్ శాఖ నుంచి కావాల్సిన సౌకర్యాలు, సహకారం అందిస్తామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ.. రైతుల కోసం ఈ మార్కెట్‌ను తీసుకువచ్చేందుకు గత మూడు నెలల నుంచి కృషి చేశామన్నారు. ఇది రైతులకు ఎంతో మేలు చేస్తోందని రవాణా సమయం, రోడ్డు ప్రమాదాల నివారణ తగ్గుతాయన్నారు. వ్యాపారులను సైతం గుడిమాల్కాపూర్, బోయన్‌పల్లి నుంచి చేవెళ్లకు రప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ట్రేడర్స్ రాజు, ఖాజా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింలు, సూపర్‌వైజర్ మహేందర్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, ఎంపీటీసీ రాములు, డైరెక్టర్లు చంద్రశేఖర్, నర్సింలు, నాయకులు నర్సింహారెడ్డి, విఠల్‌రెడ్డి, రాఘవేందర్ గుప్తా, మధుసుధన్‌రెడ్డి, పాండు, చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మంచేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, యాదయ్య, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే నియామకం జరగాలి

జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: ఎలక్షన్ కమిషన్ నియామకం పాత పద్ధతిలోనే జరగాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆఫ్ సెక్యులర్ డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో 'నల్లచట్టాలను రద్దు చేయాలి .. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ .. ఎన్నికలు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకే ఎన్నికల కమిషన్ నియామక విధానాన్ని కేంద్రం మార్చిందన్నారు. ప్రధానమంత్రి ఒకరు, మరొకరు ప్రతిపక్ష నాయకుడు, మరొకరు చీఫ్ జస్టిస్ కాకుండా ప్రధాని నామినేటెడ్ చేసిన ఒక వ్యక్తి నియమించేలా మార్పులు చేశారన్నారు. ఇద్దరు బీజేపీ మనుషులు, ఒకరు ప్రతిపక్ష నేత ఉండగా బీజేపీకి మెజారిటీ ఉన్నందున తమకు అనుకూలంగా ఉండేవారిని ఎలక్షన్ కమిషనర్‌గా నియమించుకునే అవకాశం కల్పించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అలాంటి వ్యక్తి న్యాయంగా ఎన్నికలు నిర్వహిస్తారా అన్న అనుమానం మనకు కలుగుతుందన్నారు. మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, సోగరాబేగం, తెలంగాణ విఠల్ మాట్లాడుతూ .. బీజేపీకి ఎన్నికలు సమీపించగానే రాముడు గుర్తుకు వస్తాడని, ఇప్పుడు తిరిగి రామమందిరం ప్రారంభం పేరుతో ప్రచారం చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ 146 మంది సభ్యులను సస్పెండ్ చేసి వారికి అనుకూలంగా ఉన్న బిల్లులను పాస్ చేయించుకున్న చరిత్ర లేదన్నారు. బీజేపీని వ్యతిరేకించిన వారిని అర్బన్ నక్సల్స్‌గా ముద్రవేస్తున్నారని ఆరోపించారు.